నమస్తే తెలంగాణ
సూర్యాపేట
10 | నల్లగొండ, శుక్రవారం 25 అక్టోబర్ 2024 | SURYAPET

శ్రీశైలం నుంచి సాగర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

20 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

నందికొండ, అక్టోబర్ 24 : నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు గురువారం శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ఎన్నెస్పీ అధికారులు డ్యాం 20 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గడంతో బుధవారం క్రస్ట్‌గేట్లను పూర్తిగా మూసివేశారు. గురువారం ఉదయం తిరిగి ఇన్‌ఫ్లో పెరగడంతో సాగర్ డ్యాం 2 క్రస్ట్ గేట్లను తెరిచిన అధికారులు క్రమంగా పెంచుతూ రాత్రి వరకు 20 క్రస్ట్ గేట్ల ద్వారా 16,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎడమ కాల్వ ద్వారా 6,173 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 10,350, జలవిద్యుత్ కేంద్రం ద్వారా 25,213, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, వరద కాల్వ ద్వారా 400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్ట 590 అడుగులు(312.50 టీఎంసీలు) కాగా ప్రస్తుతం పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉంది. సాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి 20,6536 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అంతే మాత్రంలో అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది.

అన్నదాతకు ఏదీ గిట్టుబాటు?

ధాన్యానికి మిల్లర్లు చెప్పిందే ధర

- ప్రారంభం కాని ఐకేపీ కేంద్రాలు.. మిల్లుల వద్దే ధాన్యం విక్రయాలు
- మిల్లుల వద్ద రూ.500 బోనస్ ఇవ్వకపోవడంతో నష్టపోతున్న రైతులు

మిర్యాలగూడ, అక్టోబర్ 24 : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామనుకునే సరికి గిట్టుబాటు కాక నష్టపోతున్నారు. కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం, పట్టించుకోవాల్సిన అధికారులు పత్తా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. దాంతో రైస్ మిల్లర్లు సిండికేట్‌గా మారి ఒక రేటు నిర్ణయించి, అదే ధరకు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. గ్రేడ్-1 సన్న ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320తోపాటు రూ.500 బోనస్ ఉండగా.. నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ, పరిసర ప్రాంతాల రైస్ మిల్లర్లు మాత్రం రూ.2,200 నుంచి రూ.2,400 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు.

మిర్యాలగూడ సమీపంలోని రైస్ మిల్లు బయట ధాన్యం లోడ్లు

ప్రారంభం కాని ఐకేపీ కేంద్రాలు

ప్రభుత్వం రైతులకు కింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల సమయంలోనే ప్రకటించింది. కానీ గత యాసంగి కొనుగోళ్లలో బోనస్ ఇవ్వలేదు. ప్రస్తుతం వానకాలం కూడా కేవలం సన్నరకం ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని కొర్రీ పెట్టింది. నల్లగొండ జిల్లాలో ఐకేపీ కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో మిల్లుల వద్దే ధాన్యం విక్రయించాల్సి వస్తున్నది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నలుమూలల నుంచి సన్న ధాన్యం తీసుకొచ్చి మిర్యాలగూడ రైస్ మిల్లుల వద్ద మిల్లర్లు చెప్పిన ధరకే అమ్ముకొని వెళ్తున్నారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే మద్దతు ధర రూ.2,320తో పాటు బోనస్ రూ.500 కలిపి కింటాకు రూ.2,820 వస్తుంది. కానీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడం, ప్రారంభించిన చోట కూడా కొనుగోళ్లు చేపట్టక పోవడం వల్ల రైతులు మిల్లుల వద్దే ధాన్యం అమ్ముకోవాల్సి వస్తున్నది. మిల్లులకు అమ్ముకి ధాన్యానికి బోనస్ లేకపోవడంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు మిర్యాలగూడ రైస్ మిల్లర్లు సిండికేట్‌గా మారి కింటాకు రూ.2,200 నుంచి రూ.2,400 వరకే ధర చెల్లించాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం సాగర్ ఆయకట్టులో వరి కోతలు ఇంకా ప్రారంభం కాలేదు. నల్లగొండ, తిప్పర్తి, నకిరేకల్, సూర్యాపేట, రామన్నపేట, మునుగోడు ప్రాంతాల నుంచి మిర్యాలగూడకు ధాన్యం వస్తున్నది. ఇంత దూరం తీసుకురావడం వల్ల ట్రాక్టర్ కిరాయి అధికంగా చెల్లించాల్సి రావడంతోపాటు ధరలో కూడా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్యాలగూడ సమీపంలోని ఓ మిల్లుకు నకిరేకల్‌కు చెందిన రైతు రెండు ట్రాక్టర్లలో 80 కింటాళ్ల ధాన్యాన్ని తీసుకురాగా, ధర రూ.2,200 మాత్రమే దక్కింది. రామన్నపేటకు చెందిన మరో రైతు 50 కింటాళ్ల ధాన్యం రూ.2,250కి పెట్టారు. నాణ్యత లేదు, తేమ ఎక్కువ ఉందంటూ కుంటిసాకులు చెప్పి తక్కువ ధరకు అడుగుతున్నారని, విధిలేని పరిస్థితిలో అమ్ముకుంటున్నామని రైతులు వాపోతున్నారు.

మిల్లు పాయింట్ల వద్ద బోనస్ లేక నష్టం

రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తేనే బోనస్ చెల్లిస్తామని మెలిక పెట్టింది. హైబ్రీడ్ రకాలైన పూజ, చింట్లు, హెచ్ఎంటీ, కావేరి వంటి సన్నరకం ధాన్యం పండించిన రైతులు ఎక్కువగా మిల్లుల వద్దే విక్రయిస్తుండడంతో బోనస్ నష్టపోవాల్సి వస్తున్నది. మిల్లు పాయింట్ల వద్ద విక్రయించిన వారికి కూడా ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తేమ శాతంలో సడలింపు ఇస్తేనే సన్న ధాన్యం విక్రయాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా రైతులు అత్యధికంగా సన్నధాన్యం పండిస్తున్నారు. ఈ రకం ధాన్యాన్ని 24 నుంచి 29 శాతం తేమ ఉన్నప్పుడే మిషన్ల ద్వారా వరిని కోసి నేరుగా మిల్లుల వద్ద విక్రయిస్తున్నారు. ఐకేపీ కేంద్రాల్లో కూడా తేమ శాతం సడలింపు ఇస్తేనే రైతులు సన్నధాన్యం అమ్ముకునే పరిస్థితి ఉంటుందని రైతులు చెప్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల ధాన్యం ఆరబెట్టే పరిస్థితి లేకుండా పోయిందంటున్నారు. ప్రభుత్వం చెబుతున్నట్లు 17శాతం తేమ రావాలంటే ధాన్యాన్ని 7 నుంచి 10 రోజులు ఆరబెట్టాల్సి రావడంతో కూలీల సమస్య వల్ల రైతులు విధిలేని పరిస్థితుల్లో మిల్లులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం తేమ శాతంలో సడలింపు ఇస్తేనే ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. రైతు శ్రేయస్సే ధ్యేయమని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ తేమ శాతంలో సడలింపు ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, పక్కన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తదితరులు

అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి

- రక్తహీనతను 21 శాతానికి తగ్గించడం అభినందనీయం
- 475 గ్రామాల్లో సంపూర్ణ మరుగుదొడ్ల నిర్మాణం భేష్
- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారితో ముఖాముఖి
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి హాజరు

సూర్యాపేట, అక్టోబర్ 24 : అభివృద్ధి, సంక్షేమ ఫలాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కోరారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ప్రముఖులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు బాగుందని ప్రశంసించారు. ముఖ్యంగా 2021లో 73 శాతం ఉన్న రక్తహీనత 2024 నాటికి 21 శాతానికి తీసుకురాడం అభినందనీయమన్నారు. జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కోరారు. దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛభారత్ ఒక ఉద్యమమని, జిల్లాలోని ప్రముఖులను అందులో భాగస్వాములను చేయాలని సూచించారు. 475 గ్రామ పంచాయతీలను బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. సూర్యాపేట జిల్లాను దారిద్ర రేఖ నుంచి పైకి తీసుకొచ్చే లక్ష్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, రచయితలు, కళాకారులు భాగస్వాములు అవ్వాలన్నారు. విద్య, వైద్య రంగాల్లో జిల్లా మెరుగైన స్థానంలో ఉందన్నారు. విద్యార్థులకు తరగతి గదిలో చదువుతోపాటు చేతి వృత్తుల్లో చిన్న చిన్న వస్తువులు, పరికరాల తయారీ వంటివి నేర్పించాలన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలు బాగున్నాయని గవర్నర్ మెచ్చుకున్నారు. భవిష్యత్ అభివృద్ధి మహిళా సాధికారత పైనే ఆధారపడి ఉందన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన సందర్భంగా ఆయా సంఘాల మహిళలు తయారు చేసిన చేతి వృత్తులను చూసి అభినందించారు. జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలు, ప్రముఖులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు, డాక్టర్లు, న్యాయవాదుల కృషిని తెలుసుకున్నారు. అనంతరం వారిని శాలువ, జ్ఞాపికతో సన్మానించారు.

వేగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రం తెలంగాణ : మంత్రి ఉత్తమ్

తెలంగాణ రాష్ట్రం అతి తక్కువ కాలంలో వేగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా దేశంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ అన్నారు. తలసరి ఆదాయంలోనూ ముందు ఉందన్నారు. ప్రత్యేకించి ఐటీ, సాఫ్ట్‌వేర్, ఫార్మా, సైన్స్ రంగాల్లో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నదన తెలిపారు. ఆహార భద్రతలో భాగంగా దారిద్రరేఖకు దిగువన ఉన్న ప్రజలకు మెరుగైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో జనవరి నుంచి సన్న బియ్యం అందించనున్నట్లు చెప్పారు.ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ జిల్లాలో ముఖ్యమైన ప్రార్థనా మందిరాలతోపాటు గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉద్యానం, సంక్షేమం, నీటి పారుదల, విద్యుత్, పౌర సరఫరాలు, తదితర శాఖల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, జాయింట్ సెక్రటరీ భవానీ శంకర్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్లు అన్నపూర్ణ, అనసూయ, గెల్లి అర్చనతోపాటు జిల్లా అధికారులు ప్రముఖులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 24 : జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నియోజకవర్గానికి చెందిన 30మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడికి పరామర్శ

పెన్‌పహాడ్ : మండలానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తూముల ఇంద్రసేనారావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గురువారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగంధర్, నాయకులు మారిపెద్ది శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ వెన్న సీతరాంరెడ్డి, జానకిరాంరెడ్డి, మామిడి అంజయ్య, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పొదిల నాగార్జున, కట్ల నాగార్జున, పరంధాములు ఉన్నారు.

సూర్యాపేట రూరల్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని రామ్లతండాకు చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు వాంకుడోతు నాగరాజును ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ నాయకులు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, ముదిరెడ్డి సంతోష్‌రెడ్డి, సంకరమద్ది రమణరెడ్డి ఉన్నారు.

సూర్యాపేట : జమునా నగర్‌లో వర్మీ కంపోస్ట్ తయారీని పరిశీలిస్తున్న ఇతర మున్సిపాలిటీల అధికారులు

సూర్యాపేట పారిశుధ్య విధానం పరిశీలన

- కంపోస్ట్ యార్డులను సందర్శించిన మున్సిపల్ కమిషనర్లు

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 24 : పట్టణంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా నిర్వహిస్తున్న పారిశుధ్య విధానాన్ని అధ్యయనం చేసేందుకు నకిరేకల్, చండూరు, చిట్యాల, నందికొండ, మిర్యాలగూడ, దేవరకొండ, నల్లగొండ మున్సిపాలిటీల మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్లు సూర్యాపేట మున్సిపాలిటీని గురువారం సందర్శించారు. పురపాలక పరిపాలన శాఖ ఆదేశాల మేరకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని బాలెంల, జమునా నగర్ కంపోస్టు యార్డులు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను వారు పరిశీలించారు. బాలెంలలో కంపోస్టు యార్డులో నిర్వహిస్తున్న సెమీ మెకనైజ్డ్ ఎస్బ్ల్యూఎం ప్లాంట్, డీఆర్సీసీ, బేలింగ్ మిషన్, కన్వేయర్ బెల్ట్, విండ్రో కంపోస్టు బెడ్స్, వర్మీ కంపోస్టు యూనిట్, విండో కంపోస్ట్ యూనిట్, పాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లను సందర్శించి విధానం తెలుసుకున్నారు. అదే విధంగా జమునా నగర్‌లో గల ప్లాస్టిక్ వ్యర్థాలతో టైల్స్, ఇటుకలు, అక్యూప్రెషర్ మ్యాట్‌లు, పీవీసీ పైపుల తయారీకి ముడి పదార్థంగా ఉపయోగించే విధానాన్ని తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో తడి, పొడి చెత్త సేకరణ, చెత్త వర్మీ కంపోస్టు, విండో కంపోస్ట్ చేస్తున్న విధానాన్ని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ వారికి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్లు యూసుఫ్, దండు శ్రీనివాస్, రామ్ దుర్గారెడ్డి, మున్వర్ అలీ, బాలయ్య, భాస్కర్‌రెడ్డి, వీరేంద్ర, డీఈ సత్యారావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌జీఏ ఘరానా మోసం

కొద్దిరోజుల్లోనే కోటీశ్వరులు అంటే నమ్మి మోసపోయిన బాధితులు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలల్లో బాధితులు
- రూ.కోట్లల్లో నష్టపోయిన సూర్యాపేట వాసులు

ఫిర్యాదు చేసేందుకు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంటున్న ఆర్‌జీఏ బాధితులు

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 24 : 'నిరుద్యోగులకు ఉద్యోగావకాశం.. కేవలం 1,800 రూపాయలు చెల్లించి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి. అందులో వచ్చే యాడ్స్‌ను ప్రతి రోజూ చూస్తే చాలు. మీ అకౌంట్లో రోజూ డబ్బులు వేస్తాం. వాటిని వారానికొకసారి విత్‌డ్రా చేసుకోవచ్చు. గిఫ్ట్ అమౌంట్, బోనస్ అమౌంట్‌తో పాటు నెలనెలా జీతం కూడా ఇస్తాం. మా మాట నమ్మండి. కొద్దిరోజుల్లోనే కోటీశ్వర్లు అవ్వచ్చు' అంటూ మాయ మాటలతో జనం ముందుకు వచ్చిన ఆర్‌జీఏ సంస్థ కోట్లాది రూపాయలు దండుకున్నది. గత జూలై నెలలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో అమెరికాకు చెందిన సంస్థగా చెబుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలంటూ ఓ వ్యక్తి ఆర్‌జీఏ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారు. అవగాహన సదస్సులు పెడుతూ వచ్చిన ప్రతి ఒక్కరి నుంచి రూ.1,800 కట్టించుకోవడమే గాక వారు మరికొంతమందితో డబ్బులు కట్టించేలా జిల్లా కేంద్రానికి చెందిన కొందరిని మధ్యవర్తులుగా పెట్టుకున్నాడు. తమ సంస్థలో రూ.1,800 కట్టి సభ్యత్వం తీసుకున్న వారికి యాప్ ఇచ్చారు. రోజూ 4 నుంచి 5 యాడ్స్‌ను పంపిస్తూ వాటిని చూసిన వారికి రోజూ 60 రూపాయలను యాప్‌లో జమ చేశారు. ఇలా 1,800 కడితే రోజుకు రూ.60, 4,500 కడితే 260, 15వేలు కడితే 540, 45వేలు కడితే 1,620, లక్షా 20వేలు కడితే 4,650 రూపాయలు అంటూ వసూలు చేశారు. చైన్ లింక్‌లో ఒక వ్యక్తి కింద 400 మంది సభ్యులు చేరితే వారికి లక్ష రూపాయల వేతనంతో పాటు సమావేశాలను ఏర్పాటుచేసుకునేందుకు అయ్యే ఖర్చులు ఇస్తూ వచ్చారు. ఇలా డబ్బులు వస్తుండడంతో అందులో చేరిన వారు తమకు తెలిసిన ప్రతి ఒక్కరినీ మోటివేట్ చేసి డబ్బులు కట్టించారు. వారు కూడా ఉన్నవి అమ్ముకుని మరీ లక్షల్లో పెట్టుబడి పెట్టారు. మరి కొందరు తమ బంధువులు, తెలిసిన వారికి మీ డబ్బుకు మాది గ్యారంటీ అంటూ ప్రామిసరీ నోట్లు రాసి ఇచ్చి లక్షల్లో డబ్బు పెట్టించారు. యాప్‌లో వచ్చిన డబ్బులను సైతం మళ్లీ యాప్‌లోనే పెట్టుబడి పెట్టడంతో భారీగా మోసపోయారు. ఇలా జమ అయిన మొత్తాన్ని వారంలో ఒక రోజు బుధవారం విత్‌డ్రా పెట్టుకునే అవకాశాన్ని కల్పించగా నిన్న బుధవారం విత్‌డ్రా ఆప్షన్ కనిపించక లేదు. దాంతో యాప్‌లో డబ్బు పెట్టిన వారంతా భయాందోళనకు గురయ్యారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 50 వేల మంది ఆర్‌జీఏ బాధితులు ఉన్నట్లు తెలుస్తున్నది. ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయించి తాము ఎంత నగదు పెట్టి, ఎలా మోసం పోయింది వివరిస్తున్నారు. దాంతో పోలీసులు సదరు మోటివేటర్స్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చి ఎంక్వయిరీ చేస్తున్నట్లు తెలిసింది.

ఆరు లక్షలు మోసపోయాను

నేను మొదటి ఆర్‌జీఏ సంస్థను నమ్మలేదు. నా వద్దకు ఓ వ్యక్తి వచ్చి బాగా డబ్బులు వస్తాయని నమ్మించాడు. ఈ నెల 17న ముందు నేను మీ పేరున 15వేలు కడుతున్నాను.. తరువాత నాకు ఇద్దూలే అన్నాడు. యాప్‌లో డబ్బులు పడ్డాయి చూడు అని చూపెట్టి బుధవారం డ్రా చేసుకొవచ్చని చెప్పాడు. దాంతో నమ్మి నేను, నాకు తెలిసిన వారి నుంచి రూ.6లక్షల వరకు కట్టించాను. వారి డబ్బుకు నాది బాధ్యతని ప్రామిసరీ నోట్లు రాసిచ్చాను. పోలీసులు విచారణ చేసి మా డబ్బులు ఇప్పించాలి.

– కోనం యాదగిరి, ఇంద్రియాల గ్రామం, యాదాద్రి భువనగిరి జిల్లా

2 లక్షల రూపాయలు కట్టాం

ఆర్‌జీఏలో చేరమని నాకు తెలిసిన వారు వెంట పడడంతో 45 వేల రూపాయలు కట్టాను. తరువాత నా కుటుంబ సభ్యులతో రూ.2లక్షల వరకు పెట్టించాను. పని చేసే వద్ద ఆఫీస్ స్టాఫ్‌నూ జాయిన్ చేయించాను. బుధవారం డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా విత్‌డ్రా ఆప్షన్ కనిపించ లేదు. ఏం జరిగిందో తెలుసుకునేలోపే సంస్థ ఎత్తేసినట్లు తెలిసింది. ఆర్‌జీఏ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను.

–ఆడోతు నాగరాజు, మిర్యాలగూడెం

రామన్నపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

అంబుజా సిమెంట్ పరిశ్రమకు అనుమతులు ఇవ్వొద్దు

- సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధిని చాటుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, అక్టోబర్ 24 : రామన్నపేట మండల కేంద్రంలో అదానీ గ్రూప్‌కు చెందిన అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుమతులు ఇవ్వకుండా తన చిత్తశుద్ధిని చాటుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో మీడియాతో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చి సిమెంట్ పరిశ్రమను ఆపి ప్రజలకు మేలు చేస్తే పరిసర గ్రామాల్లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున అభ్యర్థులను పోటీలో నిలబెట్టబోమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ రోజున వెల్లువెత్తిన ప్రజాగ్రహం చూసైనా సిమెంట్ పరిశ్రమకు అనుమతి ఇవ్వదన్నారు. లేని పక్షంలో అదానీ గ్రూప్ కొనుగోలు చేసిన భూముల్లో పేదలతో కలిసి వచ్చి గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. రామన్నపేటకు రెండు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన తనను ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా అరెస్టు చేసి నిర్బంధించి మునుగోడు, చండూరు, నాంపల్లి పోలీస్ స్టేషన్లకు తిప్పారని తెలిపారు. పోలీసులు ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని ఎలా అనుమతించారని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ పేరుతో 100కోట్ల రూపాయలు తీసుకున్నది, మంత్రి పొంగులేటి, అదానీని కలిసింది వాస్తవం కదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తమ కేసులను తప్పిపుచ్చుకోవడానికే ప్రజల ఆరోగ్యాలకు హాని కలిగించే సిమెంట్ పరిశ్రమను ఈ ప్రాంతంలో పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత మార్చి నెలలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు నివేదికను తయారు చేశారంటూ అందుకు సంబంధించిన ప్రతులను బహిర్గతం చేశారు. మండల కేంద్రంలో అదానీ కొనుగోలు చేసిన భూముల పక్కనే ఉన్న 584 సర్వే నెంబర్‌లోని 114 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ పందేండ్ల పాలనలో అదానీ కాలుష్య కంపెనీలను రాష్ట్రంలో అడుగు పెట్టనీయలేదన్నారు. అదానీ గ్రూప్ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును రద్దు చేసుకునేంత వరకు ప్రత్యేక కార్యాచరణతో ప్రజల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి పోశబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు మర్రి జలేందర్‌రెడ్డి, మెట్టు మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, గొరిగే నర్సింహ, బాలగోని నర్సింహ, దోమల సతీశ్, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి జాడ సంతోశ్, నాయకులు కన్నెబోయిన బలరాం, కూనూరు ముత్తయ్య, మిర్యాల మల్లేశం, గర్దాసు విక్రమ్, శివ, లక్ష్మణ్, లవణం రాము, బొడ్డు అల్లయ్య, మామిళ్ల కుమార్, బుర్ర శ్రీశైలం, ఎండీ అంజద్, జాడ అమరేందర్‌రెడ్డి, నల్ల సైదులు, బాసాని రాజు, ఉపేందర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న పర్యావరణ పరిరక్షణ వేదిక సభ్యులు

ఎసెన్షియల్ కమిటీకి పంపే రిపోర్టును

ప్రజల ముందుంచాలి

- కలెక్టర్‌కు రామన్నపేట పర్యావరణ పరిరక్షణ వేదిక వినతి

రామన్నపేట, అక్టోబర్ 24 : రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో పూర్తి స్థాయిలో వ్యతిరేకత తెలిపినందున ఎసెన్షియల్ కమిటీకి వాస్తవిక నివేదిక పంపి పరిశ్రమ రాకుండా చూడాలని రామన్నపేట పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ హనుమంతు కె జండగేకు కలెక్టరేట్‌లో కలిసి అందజేశారు. కమిటీకి అందించే నివేదిక బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాభిప్రేయ సేకరణలో సుమారు 10 వేలమంది పాల్గొని సిమెంట్ పరిశ్రమ వద్దని వ్యతిరేకించారన్నారు. అన్ని గ్రామాల ప్రజలు పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా మాట్లాడాలని పనులు వదులుకొని మరీ వచ్చి తమ అభిప్రాయం తెలిపారని పేర్కొన్నారు. పూర్తి స్థాయి నివేదికను బహిరంగ పరిచి ప్రజల ముందు ఉంచాలన్నారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ వేదిక సభ్యులు ఎండీ జహంగీర్, మేక అశోక్‌రెడ్డి, గంగుల రాజిరెడ్డి, సిరిగిరెడ్డి మల్లారెడ్డి, జెల్లెల పెంట